కథా నిలయం
3813
శ్రీకాకుళం

# ఇదో టెక్నిక్!

ఆఫీసంతా హడావుడిగా వుంది, కొత్త జనరల్ మేనేజర్ వస్తున్నాడని. పాత జనరల్ మేనేజర్ ఆ క్రితం రోజే అతనికింద పనిచేసే ఆఫీసర్‌కి ఛార్జీ ఇచ్చేసి అర్జంటుగా అదిలాబాద్ డివిజన్‌కి వెళ్ళిపోయాడు. "కొత్త జనరల్ మేనేజర్ చాలా స్ట్రిక్టు మనిషట. రూల్ అంటే రూలేట." ప్రతి నోటా ఇదే మాట. నిజంగా పనిచేసే వాళ్ళు ఇవేవీ పట్టించుకోవడంలేదు. వాళ్ళ పన్లో వాళ్ళున్నారు. "ఎవరొస్తే మనకేం? మన పని మనం చేసుకు పోవాలిగా" అంటూ. ఎప్పుడూ పని చెయ్యకుండా తప్పించుకు తిరిగే పనిదొంగలు, ఏదో పని చేస్తున్నట్టు, హడావుడిగా తిరుగుతున్నారు. కొత్త జనరల్ మేనేజర్ గారు రానే వచ్చారు సరిగ్గా పన్నెండున్నరకి. ఆఫీసర్లందరూ పరుగెత్తుకుంటూ అతని కారుకి ఎదురెళ్ళి కొందరు డోరు ఓపెన్ చేశారు. కొందరు వంగి వంగి నమస్కారాలు చేశారు. జి.ఎమ్. గారు కారు దిగిన వెంటనే రయ్‌మని గబగబా పరుగెత్తినంత స్పీడుగా నడుస్తూ, తన గది ఎక్కడుందో చూపించమన్నారు. కింది ఆఫీసరు నిజంగానే పరుగెడుతూ, ముందు కెళ్లి దారి చూపించడమే కాకుండా, అతను లోపలికి రావడానికి తలుపు అడ్డం రాకుండా పట్టుకుని నుంచున్నాడు. కొత్త జి.ఎమ్. లోపలికెళ్ళి తన టేబిల్ దగ్గర నుంచుని రెండు నిమిషాలు కళ్ళు మూసుకుని పెదవులు కదిపాడు. రెండు నిమిషాల తరవాత "కూర్చోండి ప్లీజ్" అన్నాడు జి.ఎమ్.

అందరూ టప్‌మని కూర్చున్నారు. పాత ఆఫీసరు అదివరకు అలవాటు ప్రకారం అందరికీ కాఫీలు తెప్పించేశాడు.

"ఇవన్నీ ఏమిటండీ?" అడిగాడు జి.ఎమ్.

"కొత్త ఆఫీసరు వొచ్చినా, ఏవైనా మీటింగులు జరిగినా కాఫీ తెప్పించడం ఆనవాయితీ" అన్నాడు నవ్వుతూ పరిపాలనా విభాగానికి చెందిన అధికారి.

"చూడండీ! ఇదంతా వేస్ట్‌ఫుల్ ఎక్స్‌పెండిచర్. మీటింగుల్లో అసలు

చర్చలకన్నా 'ఈటింగు'లే ఎక్కువవుతాయి. ఈ అనవసరపు ఖర్చులు తగ్గించాలి" కాఫీ తాగి కప్పు కింద పెడుతూ చెప్పేడు జి.ఎమ్.

"అలాగేసార్. గుడ్ ఐడియా! ప్రతి మీటింగులోనూ ఇష్టం వున్నా లేకపోయినా ఇచ్చారు గదా అని కాఫీ తాగడం, ఆ తరువాత కడుపులో తిప్పడం."

"అది కాదయ్యా! ఒక కాఫీ కప్పు ఖరీదు ఒక రూపాయుంటుంది కదా! మనం ఎంతమంది వున్నాం?"

"నలభై మంది సార్."

"అంటే ప్రతి మీటింగుకీ తప్పని సరిగా నలభై రూపాయలు ఆదా చేసిన వాళ్ళమవుతాం. ఏమంటారు?"

ఆ తరువాత ఎవరి పేర్లు వారు చెప్పుకుని ఎవరెవరు ఏమేం పనులు చేస్తున్నారో అన్నీ ఎవరికి వారు పరిచయం చేసుకుంటూ చెప్పుకున్నారు. పరిచయాలు పూర్తయ్యాక జి.ఎమ్. గారు వారందరినీ ఉద్దేశించి తమ అమూల్య సందేశాన్నందించారు. "పని చకచకా సాగిపోవాలి! పెండింగ్లో ఏ కాగితం వున్నా వారి మీద తగిన చర్య తీసుకోబడుతుంది. లంచగొండితనం, అప్రమత్తత, అజాగ్రత్త, నిర్లక్ష్యం, పనిలో జాప్యం ఇవేవీ తను సహించబోననీ, రూలు ప్రకారం నడవనివారికి తగిన శిక్షపడుతుందనీ ఆ తరువాత తనని తిట్టుకోవద్దనీ చెప్పాడు.

పనిచేసే ఆఫీసర్లు ఓహో అన్నారు. పని దొంగల గుండె వేగంగా కొట్టుకుంటూ వుంటే అరచేత్తో పట్టుకోవడానికి ప్రయత్నించారు. మొత్తానికి అందరూ ఆ క్షణంలో "ఓహో" అన్నారు.

ఆ మర్నాడే ఈ టేబిల్ చూసేవారికి ఆ టేబులూ, ఆ టేబులు చూసేసరికి ఈ టేబులూ ఇలా అందరినీ బదిలీ చేస్తు ఇచ్చిన ఆర్డర్ని చూసి విస్తుపోయారు అందరూ. అయితే అలా జరగడం మంచిదేననీ, ఒకరే ఎప్పుడూ ఒక సీటుని పట్టుకుని వేళ్ళాడకూడదనీ, అందుచేత జి.ఎమ్. గారు ఇలా చేశారనీ జి.ఎమ్. గారి శక్తిసామర్థ్యాలని కొనియాడారు. అయితే పని దొంగలకి ప్రాముఖ్యమైనటువంటి సీటూ, పనిచేసే వాళ్లకి సాధారణమైనటువంటి సీటు

ఇవ్వడాన్ని గురించి కొంత చర్చ జరిగినా అది జి.ఎమ్. గారు కావాలనే పనిచెయ్యని వాళ్ళచేత పనిచేయించడానికి అలా చేశారని సమర్థించుకున్నారు. అతని చాతుర్యానికి ఆశ్చర్యబోతూ అంతటి మనిషి దగ్గర పనిచెయ్యడం తమ అదృష్టంగా భావించారు.

కానీ అతని ధాటికి ఈ పని దొంగలూ, అసమర్థులూ ఎలా తట్టుకుంటారా అని వాపోయారు కొందరు. "ఏం జరుగుతుందో చూద్దాం" అనుకున్నారు కొందరు. "వీళ్ళ పని పడుతాడులే! ఇన్నాళ్లూ పనీపాటా చెయ్యకుండా హాయిగా తిరిగేవాళ్ళు, ఇప్పుడు తెలిసొస్తుంది" అని ఎదురు చూసేవాళ్ళు కొందరూ, అందరూ ఆరు నెలలు గడిచినా వారెదురుచూసేదేమీ జరగక పోయేసరికి ఆశ్చర్యపోయారు. అంతేకాదు వారనుకున్న దానికి వ్యతిరేకంగా ఆ వర్గీయుల ప్రాముఖ్యత నానాటికీ పెరిగిపోతూ వుంటే షాక్ తిన్నారు.

అయితే క్రొన్నాళ్ళకి తెలిసిందేమిటంటే ఈ పని దొంగల వర్గం ప్రతి నిత్యం జి.ఎమ్. గారింటికెళ్లి కూరగాయల దగ్గరనుంచి ఆయన భార్యామణికి కావలసిన బ్లౌజు పీసుల దాకా సమర్పించి రావడమే కాకుండా, ఇంట్లో పన్లన్నీ కూడా కిక్కురు మనకుండా చేసి పెట్టేవారట! భార్యామణికి సూదీదారం కనబడకపోతే వెతికి పెట్టడం దగ్గర నుంచి, వంట గ్యాసు వెలిగించి పెట్టడం వరకూ వీరే చేసిపెట్టేవారట!

ఔరా! జి.ఎమ్. అని వీళ్ళు నోళ్లు తెరిచేలోగా, వారి ఇంటి ఖర్చు లెక్కలన్నీ ఆఫీసులో కాఫీల ఖర్చు ఎకౌంటులో పడ్డాయని తెలసి, జి.ఎమ్. గారి తెలివి తేటలకి ఒళ్ళు ఝల్లుమంటే నోరు మెదపలేక పెదవులు బిగుసుకు పోతూంటే గుడ్లు తేలేశారు! ★